

తీన్మార్ మల్లన్న-ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు


తెలంగాణ

# జీవగడ్డ

ఎడిటర్:
మోటపలుకుల వెంకట్

డిజిటల్ పత్రిక








ఎడిటర్ : మోటపలుకుల వెంకట్ , బుధవారం 04-02-2026 సంపుటి :02 సంచిక : 113 పేజీలు :02 వెల : 3.00


# తెలంగాణ పురపోరు

## నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3న లాస్ట్ ఛాన్స్

తెలంగాణ : మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం మంగళవారం ముగియనుంది.రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో 2,996 వార్డులకుగాను 20,313 మంది 29,694 నామినేషన్ సెట్లు దాఖలు చేశారు.ఈ మేరకు పరిశీలన అనంతరం 19,608 నామినేషన్లు అర్హత సాధించాయని అధికారులు తెలిపారు.అయితే మంగళవారం మ. 3గం. వరకు పోటీ నుంచి తప్పుకోవాలను కునే అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించు కోవచ్చు.అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది లిస్టును ఎన్నికల అధికారులు వెల్లడిస్తారు.




## వాట్సాప్‌కు సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్



వ్యక్తిగత గోప్యత విషయంలో ఆటలొద్దు
రాజ్యాంగాన్ని ఫాలో కావాల్సిందే
రూల్స్ అమలు చేయకుంటే దేశంలో నుంచి వెళ్లిపోండి
మెటాకు హెచ్చరికలు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం

2

## మేడారం జాతర విజయవంతం



హైదరాబాద్, ఫిబ్రవరి 03: ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంతమైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు.కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు.

2 లో



# మున్సిపల్ ఎన్నికలు

## మంత్రులకు సీఎం దిశానిర్దేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 03: పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటినట్లే మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని తన కేబినెట్ సహచర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార వ్యూహాలపై మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో తన కేబినెట్ మంత్రులతో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడంపై వారితో సమీక్షించారు. ఈ ఎన్నికల్లో విజయంపై నివేదికలన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగానే ఉన్నాయని వారికి సీఎం రేవంత్ స్పష్టం

2 లో

# జగిత్యాలలో జగడం

**తీవ్రంగా స్పందించిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**



బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే టికెట్లు కేటాయిస్తున్నారంటూ జీవన్ రెడ్డి వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

జగిత్యాల, ఫిబ్రవరి 03: మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వైపే అధిష్ఠానం మొగ్గు చూపడంతో.. మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి నివాసం వద్ద మంగళవారం నాడు పార్టీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే టికెట్లు కేటాయిస్తున్నారంటూ జీవన్ రెడ్డి వద్ద వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. టికెట్ల విషయంలో తన గొంతు కోశారంటూ అనుచరుల ఎదుట జీవన్ రెడ్డి కలత చెందినట్లు తెలుస్తోంది. రాజీ లేదు.. రాజీనామానే అంటూ కార్యకర్తలకు జీవన్ రెడ్డి స్పష్టం చేసినట్లు సమాచారం. దాంతో ఎమ్మెల్యే సంజయ్ నివాసాన్ని ముట్టడిస్తామని ఆయన అనుచరులు, కార్యకర్తలు ఈ సందర్భంగా హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎమ్మెల్యే సంజయ్ నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. జగిత్యాలలోని మొత్తం 50 వార్డుల్లో సంజయ్ వర్గానికి 29, జీవన్ రెడ్డి వర్గానికి 21 టికెట్లు కేటాయించారు. ఏడాదిన్నరగా ఎమ్మెల్యే సంజయ్, జీవన్ రెడ్డిల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

సంజయ్ వ్యవహార శైలిపై జీవన్ రెడ్డి కాస్త గుర్రుగా ఉంటున్నారు. ఇప్పటివరకూ జీవన్ రెడ్డిని శాంతింప చేసేందుకు అధిష్ఠానం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కనీసం ఆయనకు అధిష్ఠానం పెద్దలు ఫోన్ సైతం చేయకపోవడం గమనార్హం. దాంతో జీవన్‌రెడ్డిని హైకమాండ్ లైట్ తీసుకుందంటూ ఒక ప్రచారం పార్టీలో జోరుగా నడుస్తోంది.

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా సంజయ్ బరిలో దిగి.. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డిపై ఘన విజయం సాధించారు. అనంతరం సంజయ్.. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే కాంగ్రెస్ పార్టీలోకి సంజయ్ రాకను జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. పార్టీ పెద్దలు వెంటనే రంగంలోకి దిగి.. జీవన్ రెడ్డిని శాంతింప చేశారు. దాంతో కాంగ్రెస్ పార్టీలో సంజయ్ చేరారు.

నాటి నుంచి జగిత్యాల కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు తయారయ్యాయి. వాటిలో ఒకటి జీవన్ రెడ్డి వర్గం కాగా.. మరొకటి సంజయ్ వర్గం. ఈ వర్గాల మధ్య పోరు ఇటీవల మరింత తీవ్రమైంది. ఒక వర్గంపై మరో వర్గం ఆధిక్యాన్ని ప్రదర్శించేందుకు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకొంటుంది. దీంతో జగిత్యాలలో ఇరువర్గాల మధ్య జగడం నిత్యకృత్యంగా మారింది. అలాంటి వేళ పార్టీ వీడేందుకు సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి సన్నాహకాలు చేసుకుంటున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

# వాట్సాప్‌కు సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్



**వ్యక్తిగత గోప్యత విషయంలో ఆటలొద్దు**
**రాజ్యాంగాన్ని ఫాలో కావాల్సిందే**
**రూల్స్ అమలు చేయకుంటే దేశంలో నుంచి వెళ్లిపోండి**
**మెటాకు హెచ్చరికలు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం**

భారత పౌరుల వ్యక్తిగత గోప్యత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోమని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. దేశంలో వ్యాపారం చేయాలంటే భారత రాజ్యాంగాన్ని గౌరవించాల్సిందేనని, రాజ్యాంగ విలువలను, నిబంధనలను పాటించి తీరాలని స్పష్టం చేసింది. రాజ్యాంగ నిబంధనలను పాటించకుంటే దేశం విడిచి వెళ్లాల్సిందేనని వాట్సాప్ మాతృసంస్థ మెటాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు ఈ రోజు జరిగిన విచారణలో వాట్సాప్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనల విషయంలో వాట్సాప్ తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఫైర్ అయింది. వాట్సాప్ యూజర్ల వివరాలను, డేటాను మెటాతో పంచుకునేందుకు వీల్లేదని స్పష్టం చేసింది.డేటా షేరింగ్, మార్కెట్ ఆధిపత్యానికి సంబంధించి గత నెలలో ఎన్సీఎల్టీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వాట్సాప్, మెటా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా సహా పలువురు దాఖలు చేసిన అప్పీళ్లపై సుప్రీం విచారణ జరిపింది. ఈ సందర్భంగా వాట్సాప్ పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సీరియస్ వ్యాఖ్యలు చేశారు. 'మీరు మా దేశ పౌరుల గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలో ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేము అనుమతించబోము' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అమెరికా సంస్థ మెటాకు తేల్చిచెప్పారు.భారత చట్టాలను పాటించలేకపోతే దేశం వదిలి వెళ్లాలని సూచించారు. డేటా షేరింగ్ ఉండదని హామీ ఇవ్వాలని, లేదంటే ఈ కేసును కొట్టేస్తామని హెచ్చరించారు. చాట్ ట్రెండ్ల ఆధారంగా ప్రకటనలతో సహా వినియోగదారు డేటా ప్రవర్తన, వాణిజ్య దోపిడీ వినియోగదారుల హక్కులను ఉల్లంఘిస్తుందని కోర్టు తెలిపింది. వైద్యులతో ప్రైవేట్ చాట్‌ల తర్వాత వినియోగదారులు ఔషధాల కోసం ప్రకటనలను అందుకున్న సందర్భాలను కూడా గుర్తుచేసింది. ఇది డేటా మానిటైజేషన్ పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

---

# మున్సిపల్ ఎన్నికలు-మంత్రులకు సీఎం దిశానిర్దేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 03: పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటినట్లే మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని తన కేబినెట్ సహచర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార వ్యూహాలపై మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో తన కేబినెట్ మంత్రులతో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడంపై వారితో సమీక్షించారు. ఈ ఎన్నికల్లో విజయంపై నివేదికలన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగానే ఉన్నాయని వారికి సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారికి సర్వే నివేదికలు అందజేశారు. అన్ని మున్సిపాలిటీల్లో గెలువబోతున్నామని జోస్యం చెప్పారు. అయినా ఎన్నికల చివరి వరకు చాలా అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు చెప్పారు. ఇంకా ఎవరైనా రెబల్స్ ఉంటే.. వారిని రాజీ చేయాలని ఆదేశించారు.మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని సూచించారు. అలాగే సర్వేల్లో వెనకబడిన మున్సిపాలిటీలను ఈ సందర్భంగా మంత్రులకు సీఎం రేవంత్ సోదాహరణగా వివరించారు. అదే విధంగా జిల్లాల పర్యటన వివరాలను మంత్రులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా ఇంచార్జ్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజు వారి రిపోర్ట్ తనకు అందించాలని ఈ సందర్భంగా మంత్రులకు స్పష్టం



చేశారు. ఇక అసంతృప్తి నేతలను బుజ్జగించాలని మంత్రులకు సీఎం రేవంత్ సూచించారు.తెలంగాణ రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలతోపాటు పలు మున్సిపల్ కార్పొరేషన్లకు ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. నామినేషన్ల విత్ డ్రా సైతం నేటితో ముగిసింది. ఈ ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 13వ తేదీన వెలువడనున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికే ఎవరికి వారు రంగంలోకి దిగి తమ సత్తా చాటేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి.

---

# మేడారం జాతర విజయవంతం

హైదరాబాద్, ఫిబ్రవరి 03: ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంతమైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు.ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

తెలంగాణ జీవగడ్డ
ఎడిటర్: మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక





# పాక్ టీమ్ భారత్‌కు పోటీ ఇచ్చే పరిస్థితుల్లో లేదు

సంజయ్ మంజ్రేకర్

భారత్‌తో పాక్ ఆడటంపై టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. పాక్ టీమ్ బలహీనంగా ఉందని.. టీమిండియాకు పోటీ ఇచ్చే పరిస్థితుల్లో లేదని అభిప్రాయపడ్డాడు. భారత్‌తో మ్యాచ్ ఆడకపోయినా ఫర్వాలేదని అన్నాడు.

ఇంటర్నెట్ డెస్క్: ఫిబ్రవరి 7 నుంచి టీ-20 ప్రపంచ కప్-2026 ప్రారంభం కానుంది. దీనికి భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. అయితే బంగ్లాను ఈ మెగా టోర్నీ నుంచి ఐసీసీ తప్పించిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్ కూడా ఈ టోర్నీ నుంచి తప్పుకోవాలని ప్రయత్నించింది. కానీ ఆ దేశ ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రపంచ కప్ ఆడుతామని, కానీ భారత్‌తో మ్యాచులు ఆడబోమని పీసీబీ ప్రకటించింది. ఈ విషయంపై తీవ్ర దుమారం చెలరేగింది. భారత్‌తో మ్యాచులు బహిష్కరిస్తే పాక్.. తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఐసీసీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్(ూఖఅయిఖఎ ఝఖఅవతీవఖతీ) కీలక వ్యాఖ్యలు చేశాడు.

'భారత్-పాక్ మ్యాచ్ జరగకున్నా ఫర్వాలేదు. చాలాకాలంగా భారత్, పాక్ మధ్య మ్యాచులు రసవత్తరంగా సాగడం లేదు. పూర్తిగా ఏకపక్షంగా ఫలితాలు వస్తున్నాయి. కారణం.. పాక్ జట్టు 90వ దశకంలో ఉన్నట్టుగా బలంగా లేదు. ఇప్పుడు ఆ టీమ్ చాలా బలహీనంగా ఉంది. అసలు భారత్‌కు పోటీ ఇచ్చే పరిస్థితే లేదు. భారత్ ఆ టీమ్‌తో తలపడుతుంటే.. ఏదో చిన్న జట్టుతో మ్యాచ్ ఆడుతున్న ఫీల్ ఉంటోంది. భారత్-పాక్ పోరు కంటే కూడా టీమిండియాతో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లు తలపడుతుంటేనే ఉత్కంఠభరితంగా ఉంటోంది' అని సంజయ్ మంజ్రేకర్ అభిప్రాయపడ్డాడు.







# ఢిల్లీ క్యాపిటల్స్ టార్గెట్ 169




డబ్ల్యూపీఎల్ 2026: ఆదుకున్న మూనీ..

మహిళల ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా ఎలిమినేటర్ మ్యాచులో గుజరాత్ జెయింట్స్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్.. నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు 169 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.ఇంటర్నెట్ డెస్క్: మహిళల ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా వడోదర వేదికగా జరుగుతోన్న ఎలిమినేటర్ మ్యాచులో గుజరాత్ జెయింట్స్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్.. నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు 169 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓపెనర్ బెత్ మూనీ(62లి) హాఫ్ సెంచరీతో చెలరేగింది. మూనీ మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ రాణించలేకపోయారు. ఆఖరి వరకు మూనీ పోరాడటంతో గుజరాత్.. ఆ మోస్తరు స్కోరు అయినా చేయగలిగింది.మూనీతో కలిసి జార్జియా వేర్‌హమ్(35) కాసేపు క్రీజులో నిలిచి భారీ షాట్లే ఆడింది. వీరిద్దరూ కలిసి ఐదో వికెట్‌కు 46 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అనుష్క శర్మ(16), కాష్వీ గౌతమ్(18) పర్వాలేదనిపించారు. కెప్టెన్ గార్డ్నర్(0) తీవ్రంగా నిరాశపర్చింది. సోఫీ డివైన్(6), కనిక(6), భారతీ ఫుల్మలి(0) విఫలమయ్యారు. మరీ ముఖ్యంగా ఢిల్లీ.. ఫీల్డింగ్‌లో అదుర్స్ అనిపించింది. ఢిల్లీ బౌలర్లలో హెన్రీ 3, నందని శర్మ 2, మిన్ను మణి ఒక వికెట్ పడగొట్టారు.

# నానితో పూజ



## సుజీత్ ఫిక్స్ చేసేశాడా




నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం 'ప్యారడైజ్' సినిమాతో బిజీగా ఉన్నారు. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానుంది.నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం 'ప్యారడైజ్'సినిమాతో బిజీగా ఉన్నారు. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానుంది. తదుపరి నాని సుజీత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. పూర్తిగా యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. దీనికి 'బ్లడీ రోమియో'అనే టైటిల్ ఖరారైనట్లు సమాచారం. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది రెండో భాగంలో మొదలుకానుంది. ప్రస్తుతం చిత్ర బృందం నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంపికలో నిమగ్నమై ఉంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి నో వార్త నెట్టింట వైరల్ అవుతోంది.ఈ సినిమాలో నాని సరసన పూజా హెగ్డే కథానాయికగా నటించనుందని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలో రానుందని తెలిసింది. ప్రస్తుతం నాని ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉండటం వల్ల సుజీత్ స్క్రిప్ట్  పనుల్లో నిమగ్నమై ఉన్నారు.  ఇందులో మలయాళస్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక  పాత్రలో కనిపించనుండటం మరో ప్రత్యేక ఆకర్షణ.

